# బీఆర్ఎస్‌లో జోరుగా చేరికలు



రాయికల్ : కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అనురాధకు కండువా కప్పుతున్న కవిత



జగిత్యాల : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ కవిత

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు**

రాయికల్, అక్టోబర్ 17: రాయికల్ మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ, రాయికల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మ్యాకల రమేశ్ మంగళవారం జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మ్యాకల అనురాధ-రమేశ్ దంపతులకు ఎమ్మెల్సీ కవిత కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాయికల్ మున్సిపల్‌లో ఉన్న ఏకైక కాంగ్రెస్ కౌన్సిలర్ అనురాధ, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు రమేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఆ పార్టీకి గట్టి షాక్ తగిలింది. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర గౌడ్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్ మ్యాకల కాంతారావు, యూత్ నాయకులు మోర రామ్మూర్తి, ఎలిగేటి అనిల్, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల, అక్టోబర్ 17: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. పట్టణ వంజరి సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు పోతునుక మహేశ్, ప్రధాన కార్యదర్శి లవంగ రాజేందర్, బీజేపీ కార్యవర్గ సభ్యులు, ఓబీసీ మోర్చ రాష్ట్ర సభ్యుడు దావన పల్లి జ్ఞానేశ్వర్, వారి అనుచరులు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కవిత సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీశ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, నాయకులు ఉన్నారు.

# సంస్కృతిని కొనసాగిద్దాం..

- తెలంగాణ పండుగలను సగర్వంగా చాటిచెబుదాం
- కేసీఆర్ సీఎం అయిన తర్వాతనే పల్లెలు జలకళ ను సంతరించుకున్నాయి..
- అమ్మవారి దయతో తెలంగాణ ఎప్పుడూ సుభిక్షంగా ఉండాలి
- భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- జగిత్యాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ సంబురాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల టౌన్/జగిత్యాల అర్బన్, అక్టోబర్ 17: 'సంస్కృతి లేని సమాజం. వేర్లు లేని చెట్టు లాంటిది. వేర్లు లేని చెట్టు ఎలాగైతే నిలబడలేదో. సంస్కృతిని మరిచిపోయిన సమాజం అలాగే అంతర్ధానం చెందుతుంది. అందుకే తెలంగాణ సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది' అని భారత జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. భారత జాగృతి జగిత్యాల నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంబురాలు జరిగిన వివేకానంద మినీస్టేడియంలో మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రత్యేక విశిష్టత బతుకమ్మ, బోనాలని వాటిని సగర్వంగా ప్రపంచానికి చాటి చెబుదామన్నారు. ఘన కీర్తి కలిగిన తెలంగాణ సంస్కృతిని ఇలానే కొనసాగిద్దామని తెలంగాణ సమాజానికి ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణ పండగలు, కళలు ఎప్పటికీ వర్ధిల్లుతుండాలన్నారు. వందల ఏళ్ల నుంచి బతుకమ్మ పండుగతో సంస్కృతిని కాపాడుతున్న ఘనత తెలంగాణ మహిళలకు దక్కుతుందన్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ సంస్కృతి అయిన బతుకమ్మను, బతుకమ్మ పాటలను భవిష్యత్తు తరాల వారికి సైతం అందించాలన్న ఉద్దేశంతో పాఠశాలలకు వెళ్లి చిన్న పిల్లలకు బతుకమ్మ ఆవశ్యకతను చెప్పామని, వారికి పాటలను నేర్పించామని ఆమె గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన ప్రభుత్వ ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా, వైభవంగా, ఘనంగా బతుకమ్మను నిర్వహించుకుంటున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. బతుకమ్మ పండుగ, పాటలు అంటే తెలంగాణ మట్టి పరిమళాలే అన్నారు. మహిళల సమైఖ్యతకు, శ్రమైఖ జీవన సౌందర్యానికి, మాతృస్వామిక వ్యవస్థ ప్రాధాన్యతకు నిదర్శనాలన్నారు. బతుకమ్మ, బోనాల పండుగ లాంటివన్నీ కాలగమనంలో తెలంగాణ సంస్కృతిగా రూపుదిద్దుకున్నాయన్నారు. సంస్కృతిని భద్రంగా కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంస్కృతి అంటే మన ఆత్మలాంటిదన్నారు. సంస్కృతి లేని సమాజం అంటే వేర్లు లేని చెట్టు వంటిదని స్పష్టం చేశారు. వేర్లు కుళ్లిపోతే చెట్టు నశించిపోతుందని, అలాగే సంస్కృతిని మరిచిపోయే సమాజం తన ఉనికిని కోల్పోతుందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు అన్ని బతుకమ్మ, బోనాల వంటి పండుగలతో సమ్మిళితమై ఉన్నాయని వివరించారు. పండగల ప్రాశస్త్యాన్ని సగర్వంగా చాటి చెబుతూ, తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాలని, కాపాడాలని సూచించారు. ఇందుకు ముందుగా మన పిల్లలకు వాటి గొప్పదనాన్ని వివరించి, చైతన్యవంతం చేయాలన్నారు. పిల్లలు మన సంస్కృతిని తెలుసుకుంటే, మరో వందేండ్ల పాటు, మన సంస్కృతి సజీవంగా విశ్వయవనికపైన నిలిచి ఉంటుందన్నారు. ఇప్పటి వరకు బతుకమ్మ పాటలను మైదానాల్లోను, బతుకమ్మల వద్ద పాడిన తాను మొట్టమొదటిసారిగా మైక్ ముందు పాడానని, యూట్యూబ్లో అందరూ ఆ పాటను విని అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. రాబోయే తరాల్లో బతుకమ్మ పాట పదిలంగా ఉండేందుకు పిల్లలకు బతుకమ్మ పాటలు నేర్పించాలని కోరారు. తెలంగాణ సాధన అనంతరం రాష్ట్రం సుభిక్షంగా మారుతుందన్నారు. సీఎం కేసీఆర్ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ పల్లెల్లోని, చెరువులు, వాగులు, వంకలు, కుంటలన్నీ జలకళను సంతరించుకున్నాయని చెప్పారు. ఎటూ చూసిన పచ్చదనం కనిపిస్తుండడం సంతోషదాయకమన్నారు. అమ్మవారి దయతోటి తెలంగాణ ఇలానే సుభిక్షంగా ఉండాలని, దండిగా పంటలు ఉండాలని ఆకాంక్షించారు. బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భారత జాగృతి కార్యకర్తలను కవిత అభినందించారు.

**నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్సీ కవిత విశేష కృషి: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ కవిత విశేష కృషి చేశారని, ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. గ్రామ గ్రామాన చెరువుల వద్ద బతుకమ్మ ఘాట్ల నిర్మాణం ఆమె కృషితోనే సాధ్యమైందని, బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసిన ఘనత ఆమెకే దక్కుతుందని కొనియాడారు. బీడీ కార్మికులు ఎక్కువగా జగిత్యాల జిల్లాలో ఉన్నారని, వారి కోసం బీడీ పెన్షన్ తీసుకువచ్చిన ఘనత కూడా కవితక్కకే దక్కుతుందని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో పీఎఫ్ లేకుండా బీడీ పెన్షన్, ఇంటింటా బీమాతో కేసీఆర్ దీమా, రూ.400కు సిలిండర్ వంటి పథకాలు మహిళల కోసమే చేస్తామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ తెలంగాణ బతుకమ్మ, రుద్రమ్మ కవితక్కే అన్నారు. ఆమె కృషితో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఖండాంతరాలు దాటిందన్నారు. మహిళలు కవితక్క స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించాలని కోరారు. వేడుకల్లో ఎమ్మెల్సీ ఎల్.రమణ, తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశంగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సతీమణి రాధిక, రాయికల్, సారంగాపూర్, ఎంపీపీలు సంధ్యారాణి, జమున, తెలంగాణ జాగృతి జగిత్యాల శాఖ అధ్యక్షులు అమర్‌దీప్‌గౌడ్, జమున, కౌన్సిలర్లు, చుక్క నవీన్, పంబాల రాము, లత జగన్, అడువాల జ్యోతి లక్ష్మణ్, కొడిమ్యాల ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు స్వర్ణలత, పునుగోటి ప్రశాంతి, రాయికల్ జడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు దావ సురేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి అమ్మవారి చిత్రపటానికి అందిస్తున్న నిర్వాహకులు

## అమ్మవారి కృప అందరిపై ఉండాలి

- నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- గోవిందుపల్లిలో నవదుర్గ పీఠ క్షేత్రంలో పూజలు

జగిత్యాల, అక్టోబర్ 17: అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో నవదుర్గ పీఠ క్షేత్రంలో నవదుర్గా అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అమ్మవారి చల్లని కృప అందరిపై ఉండాలని, జిల్లా, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ పీఠం అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, లైబ్రరీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, నవదుర్గా సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

జగిత్యాల, అక్టోబర్ 17: జిల్లా కేంద్రంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొడానికి వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవీ మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మినీ స్టేడియం పక్కనే ఉన్న జయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో, శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో పూజలు చేశారు. అలాగే ఎడ్ల అంగడి, పోచమ్మగుడి ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో పూజలు చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణలు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, జిల్లా ప్రజలపై అమ్మవారి దయ ఉండాలని, పద్మశాలీ కులస్తుల ఆశీస్సులు డాక్టర్ సంజయ్ కుమార్‌పై ఉండాలని కోరారు. కుల సంఘ భవనానికి కావల్సిన తగినన్ని నిధులను మంజూరు చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ సేవా సమితి ప్రతినిధులు, స్థానిక మహిళా వార్డు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి కృషి

- నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పట్టణానికి చెందిన 300 మంది బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత , ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, అక్టోబర్ 17: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన సెంట్రల్ ముస్లిం కమిటీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మీర్ ఖాజీం అలీ, పట్టణంలో వివిధ వార్డుల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన 300 మంది మైనార్టీ యువకులు, నాయకులు బీఆర్ఎస్ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆమె కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్ రమణ, పట్టణ పార్టీ, మైనార్టీ అధ్యక్షుడు గట్టు సతీశ్ , అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలు ప్రారంభం

జగిత్యాల టౌన్, అక్టోబరు 17: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో అంతర వ్యవసాయ పాలిటెక్నిక్ క్రీడా పోటీలను రిజిస్ట్రార్ డాక్టర్ ఎం వెంకటరమణ యూనివర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జెల్ల సత్యనారాయణ, డైరెక్టర్ పాలిటెక్నిక్ డాక్టర్ జీ పద్మజ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ జీ శ్రీనివాస్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్ భారతిభట్, క్రీడల పోటీల యూనివర్సిటీ పరిశీలకుడు డాక్టర్ జే సురేశ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్, రీజినల్ అకౌంట్ ఆఫీస్, వ్యవసాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, వివిధ పాలిటెక్నిక్ ఓఎస్ఏలు, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.